www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 7 ఫిబ్రవరి 2023



ఆక్వా సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి -అమలాపురం

జిల్లా ఆక్వా రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగానికి ఇచ్చే విద్యుత్ సబ్సిడీ ఎత్తివేయడంతో జిల్లా ఆక్వారైతులు ఆందోళన చెందుతున్నారు. ఆక్వా జోన్లో ఉండి కూడా ఈఫిష్ సర్వే కారణంగా నూటికి 70 శాతం మంది విద్యుత్ సబ్సిడీ కోల్పోతున్నారనీ రైతులు ఆందోళన చెందుతున్నారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందజేసి ఆక్వారంగ సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆక్వా ఎగుమతులు వల్ల అధిక ఆదాయం లభిస్తుందని విద్యుత్ సబ్సిడీ లేకపోతే ఆక్వా కల్చర్ చేయలేమని తెలిపారు. కార్యక్రమనికి ఆక్వా రైతు సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు, చవటపల్లి నాగభూషణం, రమేష్ రాజు, సూరిబాబు రాజు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- కలెక్టరేట్ వద్ద మహాధర్నా
- ప్రభుత్వం స్పందించాలన్న ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి -అమలాపురం

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జీతాలు ఇవ్వాలని, ఫేస్‌యాప్ రద్దు చేయాలని అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్ఎల్‌సి ఐవి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేవని కొన్ని కేంద్రాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ సౌకర్యం లేదని టిఎ, డిఎలు ఐదేళ్ల నుంచి కూడా ప్రభుత్వం చెల్లించడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణకు 6 నెలల నుంచి బిల్లులు చెల్లించడం లేదన్నారు. అంగన్‌వాడీలు అప్పులు చేసి ఆహారం వండి పెడుతున్నారన్నారు. సిఐటియు నాయకులు కృష్ణవేణి మాట్లాడుతూ రకరకాల యాప్ లతో పని భారం పెంచారు కాని వేతనాలు పెంచడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు సరిగా పనిచేయడం లేదన్నారు. గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో ఫేస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవడం వీలుపడడం లేదని దీనిపై అధికారులు వేధింపులు తగ్గించాలని సిఐటియు నాయకులు బలరాం అన్నారు. సిఐటియు నాయకులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అధికారులు విజిటర్ల పేరుతో అంగన్‌వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తుండటంతో వారు అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్స్ సౌకర్యం కల్పించాలన్నారు. సర్వీస్ లో చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బీమా అమలు చేయాలని కోరారు. ర్యాలీలో సభలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెం.1ను రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు జాబ్ క్యాలెండర్ నిర్ణయించాలని లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కష్ణవేణి, జిల్లా సహాయ కార్యదర్శి కె.సుజాత, జి.వెంకటలక్ష్మి, దేవి, బేబీ గంగారత్నం, బేబీ, రాణి, వెంకటలక్ష్మి, సూర్యకుమారి, సత్యవతి, చంద్రకళ, రత్నకుమారి, ఆదిలక్ష్మి, దుర్గ, సిఐటియు నాయకులు దుర్గాప్రసాద్, బలరాం, కెవిపిఎస్ నాయకులు వసంత కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కారెం వెంకటేశ్వరరావు, నరేంద్ర పాల్గొన్నారు.


కలెక్టరేట వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు(ఇన్‌సెట్‌లో) ధర్నాకు మద్దతు తెలుపుతున్న ఎమ్ఎల్‌సి ఐవి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్

ఢిల్లీ పోరాటంతో కేంద్రానికి గుణపాఠం

- ఏప్రిల్ 5న కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలి
- సిఐటియు, కౌలు రైతు, వ్యవసాయ,కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా అనుకూల విధానాల అమలు కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించి తలపెట్టిన పోరాటంలో జిల్లాలోని కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికుల పాల్గొని కేంద్రానికి గుణపాఠం చెప్పాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక ఎంప్లాయిస్ హోమ్‌లో సోమవారం జిల్లా సదస్సు నిర్వహించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హరిబాబు, సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి నూర్ మహమ్మద్ ముఖ్య వక్తులుగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలను మరింత జఠిలం చేస్తోందన్నారు..మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజలకు వ్యతిరేకంగానూ, ప్రైవేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగాను ఉందన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికుల నియామకాలు, తొలగింపులను యజమానులు ఇష్టారాజ్యం చేసిందనీ సమ్మె, యూనియన్, కనీసం వేతనం, పని గంటలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ తదితర కార్మిక హక్కులపై కోలుకోలేని దెబ్బ కొట్టిందని అన్నారు. చాలా కాలం నుంచి కోరుతున్న కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగులు, గౌరవ వేతన కార్మికుల పర్మినెంట్, అందరికీ సామాజిక భద్రత తదితర కోర్కెలను మోడి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు బదులుగా ప్రజా అనుకూల విధానాల కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక పోరాట ప్రదర్శనలో పాల్గొని విజయ వంతం చేయాలని జిల్లా సదస్సు తీర్మానించింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తానని అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం, తన రైతు వ్యతిరేక విధానాలతో వారిని ఆత్మహత్యలకు పురిగొల్పుతోందని గత 5 సంవత్సరాల్లో 28,572 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే నల్ల వ్యవసాయ చట్టాలను కార్మికవర్గ మద్దతుతో రైతు సంఘాలు గట్టిగా పోరాడి రద్దు చేయించు కున్నాయని అన్నారు. వ్యవసాయకార్మిక సం ఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాటా ్లడుతూ వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి భద్రత, పిఎఫ్, పెన్షన్, ఆరో గ్యం కూడిన సమగ్ర చట్టం కలగా మిగిలిపోయిందన్నారు. మోడీ ప్రభుత్వం గ్రామీ ణ ఉపాధి పథకానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్లో కేటాయింపులను రూ.30వేల కోట్లు కోత పెట్టిందన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కష్ణవేణి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కుడిపూడి రాఘవమ్మ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్ర రావు లు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్, ఎన్.బలరాం, పి.వసంత కుమార్, బేబీగంగారత్నం, వి.రాంబాబు, వి.మోహనరావు, నిమ్మ కాయల వెంకటేష్, ఐ. మంగాదేవి, దైవకప, శ్రీరాంమూర్తి, పి.బాలయ్య, ఉమామహేశ్వరి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పంట పొలాలకు అందని సాగునీరు

- నీరు అందించడంలో వివక్ష చూపుతున్న ఇరిగేషన్ అధికారులు పై చర్యలకు కౌలు రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం

కోనసీమ ప్రాంతంలో పంట పొలాలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని అధికారులు సమస్యను పరిష్కారం చేయాలని పిడిఎఫ్ ఎమ్ఎల్‌సి ఐవి అన్నారు. ఉప్పలగుప్తం మండలం ఉప్పలగుప్తం గ్రామంలోని పేరాయి చెరువు గ్రామంలో పంట పొలాలకు నీరు అందక బీడు వారుతున్న పొలాలకు నీరు అందించాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్ఎల్‌సి ఐ వి రైతులతో కలిసి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. రైతులకు తక్షణం నీరు అందిటచే ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. అయినాపురం కాలువ నుంచి వచ్చే నీరు శివారు ప్రాంతమైన పేరాయి చెరువు గ్రామానికి అందడం లేదని ఈ పంట కాలువ మొత్తం పూడిక తో మూసుకు పోయిందని రెండు రోజులుగా అగ్రవర్ణ భూస్వాముల పొలాల వరకు కాలువ మరమ్మత్తులు చేసి నీరు అందించారని దళితులు ఉన్న దిగువ ప్రాంతానికి కాలవ పూడిక తీతలు మధ్యలోనే ఆపేసారని ఇది ఇరిగేషన్ అధికారులు మాపై చూపుతున్న వివక్షేనని పేరాయచెరువు గ్రామంలోని దళిత రైతులు కలెక్టర్ ముందు వాపోయారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. హరిబాబు మాట్లాడుతూ శివారు గ్రామాల వరకు పంట పొలాలకు నీరు అందించే ఏర్పాట్లు ఇరిగేషన్ అధికారులు చేయాలన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. బీడు బారిన పంట పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆక్వా చెరువులు కాలుష్యం వల్ల పంట పొలాలలోని నీరంతా ఉప్పు బారుతుందన్నారు. అయినాపురం కాలువ మరమ్మత్తులు చేసి శివారు ప్రాంతాల వరకు పొలాలకు నీరు అందించే ఏర్పాట్లు చేయడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తక్షణం అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెయ్యిల మీరా సాహెబ్, ధోనిపాటి అబ్బులు, దోనిపాటి వాడపల్లి, దోనిపాటి సత్యనారాయణ, పెయ్యిల సత్యం, పెయ్యిల వీర వెంకట సత్యనారాయణ, పెయ్యిల రమణ, పెయ్యిల వెంకటేశ్వరరావు, పరమట లోవరాజు, మట్టపర్తి ఈశ్వరరావు ,దోనిపాటి శివశంకర్ తదితర రైతులు పాల్గొన్నారు.


కలెక్టర్ కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్ఎల్‌సి ఐవి, రైతు నాయకులు


మెమోరియల్ సైన్స్ ప్రారంభిస్తున్న కలెక్టర్

విద్యాభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఎన్ ఆర్ఐలు విద్యాభివృద్ధిలో భాగసామ్యం కావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు.మామిడికుదురు హైస్కూల్ పూర్వ విద్యార్థి ఈదరాడ వాసి ఎన్ ఆర్ఐ ఏరుబండి జగదీష్ ప్రభాకర్ రూ.60 లక్షలతో నిర్మించిన డాక్టర్ యేరుబండి సత్యవర్ధనరావు మెమోరియల్ సైన్స్ హాలును కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సిహెచ్.నిరంజని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిజిపి ఎన్.సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు సత్యవర్ధనరావు ని ఆదర్శంగా తీసుకొని అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు.దాత జగదీష్ మాట్లాడుతూ మంచి విలువలతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శ్రేణిలో నిలవడానికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిజిపి.ఎంవి.భాస్కరరావు, యేరుబండి విజయ్,హెచ్ఎం మైలవరపు రవీంద్ర నాద్, ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఫోన్లు టాపింగ్ చేయొద్దనా..!!

'స్పందన'తో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి స్వీకరించిన అర్జీలపై క్రియాత్మకంగా స్పందించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు స్పందన హాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక జిల్లాస్థాయి స్పందన వినతుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి సుమారు 231 అర్జీలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబులు అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని నిబంధనల మేరకు స్పందన వెబ్‌సైట్‌లో ఫొటోలతో సహా అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు లు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల కొరకు ప్రవేశపెట్టిన ముఖ ఆధారిత హాజరును ఉదయం, సాయంత్రం నిర్దేశిత సమయాలలో తప్పనిసరిగా వేయాలన్నారు. ముఖ ఆధారిత హాజరు అమలు తీరుపై ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు ఐ పోలవరం మండలం ముమ్మిడివరం గ్రామానికి చెందిన దూనబోయిన శేషారావు ట్రై సైకిల్ ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌ను అభ్యర్ధించాడు. ట్రై సైకిల్ ను విభిన్న ప్రతిభావంతులు వయోవ ద్దుల సంక్షేమ శాఖ ద్వారా ఉచి తంగా అందించారు. కాకినాడ కేంద్రంగా నిర్వహించిన రెవెన్యూ శాఖ క్రికెట్ పోటీలలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కెప్టెన్ హరి సారధ్యంలోని టీం విన్నర్ గా నిలిచారు. ఈ టీం సాధించిన కప్పును సోమవారం జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్ నందు గెలుపొందిన టీం సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు, డిసి హెచ్ఎస్ పద్మశ్రీ రాణి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ఎస్ ఇలు చంటిబాబు, కష్ణారెడ్డి, గహ నిర్మాణ సంస్థ పీడీ ఎం.బాబురావు డిఎస్ఒ ఎ.పాపా రావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన మంత్రి

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -రామచంద్రపురం

దాళ్వా పంటకు అందని సాగునీరు శీర్షిక ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 3న ప్రచురితమైన వార్తకు రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు ఈ మేరకు సోమవారం శివల పంట కాలవను దంగేరు వద్ద నీరు అందని పంట పొలాలను మంత్రి అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ పంట పొలాలకు కావలసిన సాగునీరు అందించే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. శివల, ఎర్ర పోతవరం, కుడుపూరు గ్రామాల్లో రైతుల సూచనల మేరకు ఆయా గ్రామాల్లో పంట పొలాలను ఇరిగేషన్ ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు. వరి సాగుకు రెండో పంటకు సాగునీటి ఎద్దడి ఉందని రైతులు తన దష్టికి తీసుకు వచ్చారని, స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించాలని అవసరమైతే ఇంజన్ల ద్వారా నీటిని తోడుకోవాలని ఆయిల్ కు సంబంధించిన బిల్లులను ప్రభుత్వపరంగా అందిస్తారన్నారు అవసరమైతే టేకి కాలువ ద్వారా సాగునీరు వినియోగించాలని రైతులకు మంత్రి సూచించారు. కాలువకు వస్తున్న నీటి సాంద్రత పెంచాల్సిన అవసరం రైతులు తెలియచేశారు. మంత్రి వెంట వైసిపి నాయకులు పెట్టా శ్రీనివాస్, ఇళ్ళ సూర్యనారాయణ, పంపన సుబ్బారావు, బత్తుల అప్పారావు, అన సూరి సాయి బాబు, కె. గంగవరం తహశీల్దార్ వైద్యనాథ శర్మ, ఇరిగేషన్ డిఇ వి.రామకృష్ణ, ఎఇ సుజాత, రైతులు తదితరులు పాల్గొన్నారు.


దంగేరు వద్ద పొలాలను పరిశీలిస్తున్న మంత్రి వేణు

మండల పరిధిలో రోడ్లకు అంచనాలు రూపొందించాలి

మండల పరిధిలో దెబ్బతిన్న అన్ని రోడ్లకు అంచనాలను సిద్ధం చేయాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులకు మంత్రి వేణు సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి అంబటి భవాని అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశానికి పలువురు అధికారులు, సర్పంచులు ఎంపిటిసి సభ్యులు డుమ్మాకొట్టారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గ్రామం యూనిట్ గా తీసుకొని నాడు-నేడు స్కూల్స్, ,సచివాలయాలు.,వెల్ నెస్ సెంటర్స్, అభివద్ధి పనులు పై ప్రజలకు అవగాహన కల్పించి మోడల్ మండలం గా ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. సమావేశానికి రాని అధికారులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్య క్రమం లో జెడ్‌పిటిసి సభ్యుడు మేర్నిడి వేకటేశ్వరారావు. ఎంపిడిఒ ఎన్..కీర్తి స్పందన, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్ లు మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు హాజరయ్యారు.


సాయం అందజేస్తున్న ఎమ్ఎల్ఏ జగ్గిరెడ్డి

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి- రావులపాలెం

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన దేవరపల్లికి చెందిన మామిడిశెట్టి సూర్యనారాయణ కుటుంబసభ్యులను ఎమ్ఎల్ఏ సోమవారం చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆ కుటుంబానికి రూ.30 వేలు, గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు రూ.25 వేలు మొత్తం రూ.55 వేలు సాయం అందజేశారు.

రావులపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాజమండ్రి మణికంఠ తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో రెండు కిడ్నీలు పాడైపోయినాయి. దీంతో ఆకుటుంబం మణికంఠకు వైద్యం అందించలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొటోంది. సమాచారం తెలుసుకున్న కాశీ అన్నపూర్ణ దేవి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మణికంఠ ఇంటికి చేరుకుని రూ.15వేలు సాయం అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి వినతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఒఎన్‌జిసి సంస్థ కార్యకలాపాల వల్ల నష్టపోతున్నామంటూ ఉప్పలగుప్తం పంచాయితీ పేరాయిచెరువు, ఏటిమెరక, పాపాయిచెరువు ,బడుగుపేట, మధుర పేట గ్రామస్తులు సోమవారం తహశీల్దార్ జె. వెంకటేశ్వరి కి వినతి పత్రం అందజేశారు. లాభాలు అర్జిస్తున్న సంస్థ తమ గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు పెయ్యల దుర్గారావు, మధుర ప్రతాప్, కుంచే రాజేష్ తదితరులు ఉన్నారు.

సమస్యలపై ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి -రామచంద్రపురం

రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పలు సమస్యలపై సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ సింధూ కు వినతి పత్రం అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తాను ఆర్డీవో పి.సింధూ సుబ్రహ్మణ్యం హామీ ఇచ్చారు.కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి ఎం. దుర్గా ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు, జిల్లా నాయకులు జి. సూరిబాబు, పిడి ఎస్‌యు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధు, జి.మంగమ్మ, పి.నాగమణి, వి.సుబ్బలక్ష్మి, కె. సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు..

'అదానీ'కి అండగా కేంద్రం

ప్రజాశక్తి-అమలాపురం

ఎల్ఐసి, భారత స్టేట్ బ్యాంక్ సంబంధించిన నిధులను ఆదాని గ్రూపునకు చెందిన కంపెనీల్లో పెట్టడం వల్ల, డిపాజిట్ దారులు నష్టపోవలసి వస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం అమలాపురం పట్టణంలో ఎల్ఐసి కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ అదాని కంపెనీకి యాజమాన్యానికి ప్రధాని మోడి సర్కార్ అండగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అధాని కంపెనీకి చెందిన అన్ని కార్యకలాపాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కామన ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవి లత అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో విద్యార్థినులకు ఇచ్చే మెరిట్ స్కాలర్‌షిప్ ఆత్రేయపురం మహాత్మా గాంధీ జూనియర్ కళాశాల విద్యార్థులు 27 మందికి రూ.2 లక్షల 70 వేల చెక్కులను అందజేశారు. విద్యార్థులకు ఈ నగదు ప్రోత్సాహం ఎంతోగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పిఎస్.రాజు, ప్రిన్సిపల్ బెజవాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రాజెక్టు వర్క్‌తో సృజనాత్మకత

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యార్థులు చేసే ప్రాజెక్టులతో వారిలో సృజనాత్మకత పెంపొందుతుందని ముమ్మిడివరం ఎమ్ ఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ అన్నారు. అమలాపురానికి చెందిన బి.ఆదిత్య సాయి కుమార్ రాజమహేంద్రవరం శ్రీ చైతన్య స్కూల్ నందు సివిల్స్ బ్యాచ్ లో 8 వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల్లో ఆ పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ప్రాజెక్టు వర్క్ ను విద్యార్థి పూర్తిచేశాడు. ఈ ప్రాజెక్ట్‌ను ఎమ్ఎల్ఎ పొన్నాడ పరిశీలించి అభినందించారు.


హంసవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి -రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి తెప్పోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు సప్త గోదావరి జిల్లాలో హంస వాహనంపై స్వామివారి ఉత్సవిగ్రహాలను విహరింపజేశారు కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆలయ ఈ ఓ తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులు

జిల్ధా స్థాయితైక్వాండో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట

తైక్యాండో 28 వ ఇంటర్ క్లబ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కొరియోగి తదితర విభాగాలలో ఆదివారం జిల్లా స్థాయిలో ఎంపికైనట్లు సీనియర్ కోచ్ పి.త్రిమూర్తులు తెలిపారు. కొరియోగి విభాగంలో పి.భార్గవి, శ్రీ కళ మొదటి స్థానం, కె.వైష్ణవి, డి.వెంకన్నబాబులు రెండవ స్థానం, పూమ్ సే విభాగంలో పి.భార్గవి, శ్రీ కళ రెండవ స్థానం సాధించారన్నారు. ఈనెల 12 న జరిగే రాష్ట్ర స్థాయి సెలక్షన్‌కి పి.భార్గవి శ్రీ కళ ఎంపికైందన్నారు. ఎంపికైన అంబాజీపేట క్రీడాకారులను హెచ్ఎం బి.హనుమంతరావు, ఉపాధ్యాయులు, కోచ్ మణికంఠ, ప్రజాప్రతినిధులు వారిని అభినందించారు.


ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

చిరుధాన్యాల ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మారేడుబాక రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో బయాలజీ విద్యార్థులు చిరుధాన్యాల ఎగ్జిబిషన్ సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.కే.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించిన సందర్భంగా చిరుధాన్యాల ప్రదర్శనను కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. 12 నెలలకుగాను 12 రకాల చిరుధాన్యాలను విద్యార్థులచే నెలకి ఒక చిరుధాన్యంపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమం వైస్ ప్రిన్సిపల్ ఆనంద్ అధ్యాపకులు అభినయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

'యువగళానికి అడ్డంకులు సృష్టిస్తోన్న వైసిపి ప్రభుత్వం'

ప్రజాశక్తి-అమలాపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్ర కు వైసిపిప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టిస్తోందని మాజీ ఎమ్ఎల్ఏ అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. అమలాపురం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బిఎస్ఐ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

బుద్ధిస్ట్ సొసైటి ఆఫ్ ఇండియా (బిఎస్ఐ) మండల శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటయింది. ఉప్పలగుప్తంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బిఎస్ఐ మండల శాఖ అధ్యక్షునిగా బిబిఆర్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా నందిక శ్రీనివాసరావు, నడింపల్లి సుబ్బరాజు, కార్యదర్శిగా గిడ్ల రమేష్, సంయుక్త కార్యదర్శిగా మధుర ప్రతాప్, కోశాధికారిగా పెట్టా శ్రీను, సభ్యులుగా కోటుం వెంకటేశ్వరరావు, తాళ్ల రవి, దేవరపల్లి వెంకటేశ్వరరావు, ముత్తాబత్తుల వెంకటరమణ, పెయ్యల దుర్గాప్రసాద్, పరమట సూర్యప్రకాష్, గోసంగి శ్రీనివాసరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బిఎస్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు మట్టా సిద్ధార్థ గౌతమ్, జిల్లా కార్యదర్శి కాశి వెంకటరమణ,కోశాధికారి సఖిలే పథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

విలసవిల్లిలో సహజ మరణం పొందిన వ్యక్తి కుటుంబానికి సోమవారం సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి వైఎస్ఆర్ బీమా పథకాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన దంగుడుబియ్యం సూర్యప్రకాశరావు(45) అనారోగ్యంతో మతి చెందాడు. ఆయన భార్య బ్రహ్మేశ్వరి కి బీమా మొత్తం రూ.లక్ష కాగా తక్షణ సాయంగా రూ.10 వేలు నగదును సర్పంచ్ ఊర్మిళాదేవి అందజేశారు.

నేరాలు ఘోరాలు



ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బొలెరో వాహనంపై లారీ బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట - కాకినాడ రోడ్‌లో లాకుల వద్ద ఉండూరు రోడ్డు అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఆదివారం అర్ధరాత్రి బొలెరో వాహనంపై బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ వెనక భాగం పూర్తిగా పాడైంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రమాదం జరుగలేదు. పెద్దాపురంలోని ఒక రైస్ మిల్ నుంచి బియ్యం లోడుతో కాకినాడ పోర్టుకు వెళ్తున్న లారీ ఉండూరు రోడ్డు అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి అటుగా వెలుతున్న బొలెరో వాహనంపై బోల్తా పడింది. ఆ బొలెరో వాహనంలో ఉన్నవారు, లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం వల్ల కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రమాద స్థలానికి స్థానిక పోలీసులు చేరుకుని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

చోరీల కేసులో ఇద్దరు అరెస్టు

54 సెల్ ఫోన్లు, 9 బైకులు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో సెల్‌ఫోన్లు, బైకులు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ప్రత్తిపాడు సిఐ కె.కిషోర్‌బాబు తెలిపారు. తుని రూరల్ మండలం కొలిమేరుకు చెందిన బొండ అప్పారావు, ఎస్.కోట మండలం కొత్తవలసకు చెందిన బోడ సురేష్ చెడు వ్యసనాలకు బానిసయ్యారు. వీరు గ్రామీణ ప్రాంతాల్లో బైకులు, అన్నవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లో ప్రయాణికుల మాదిరిగా ట్రైన్ ఎక్కి ఛార్జింగ్ పెట్టుకున్న సెల్ ఫోన్లను దొంగిలించి తక్కువ ధరలకు అమ్మే వారన్నారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్ఐలు కె.సుధాకర్, జి.సతీష్, ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది గోవింద్, విజి.కృష్ణ, సూర్యచంద్ర, సుబ్రహ్మణ్యం టీమ్‌గా ఏర్పడి ప్రత్యేక నిఘా ఉంచి చాకచక్యంగా దొంగలను పట్టుకున్నారని తెలిపారు. వీరిని ఎస్‌పి రవీంద్రబాబు, ఎఎస్‌పి పి.శ్రీనివాస్, పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీమోహన్ ప్రత్యేకంగా అభినందించారు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం శివారు ఏలేరు నది పరివాహక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఏలేశ్వరం ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సారా తయారీ నిమిత్తం నిల్వ ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి డ్రమ్ములను తగలబెట్టామన్నారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చోరీకి యత్నించిన ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట

జనవరి 17న స్థానిక కంచి సంస్థాన చైర్మన్ బ్రహ్మశ్రీ చంద్రభట్ల చింతామణిగణపతిశాస్త్రి ఇంట్లో గుప్త నిధుల వేట గురించి దొంగతనానికి వచ్చిన ఏడుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. భీమవరం, బలుసుమూడి ప్రాంతానికి చెందిన సిరిగి అర్జునరావు(43), రౌతులపూడి మండలం పైడిపాల గ్రామానికి చెందిన ఎలుగుబంటి సురేష్(39), జగ్గంపేట మండలం రాజపూడికి చెందిన బూసాల బాబూరావు(44), రాజపూడి సాయి బాబా గుడి ప్రాంతానికి చెందిన కండుల ధర్మరాజు(61), విజయ నగరం పట్టణం గాజుల రేగ ప్రాంతానికి చెందిన పిండ్రాల అప్పన్న (32), విజయనగరం అంబేద్కర్ కాలనీకి చెందిన ఆసనాల గోవింద్ (28), ఏలూరు జిల్లా కామవరపు పేటకు చెందిన గంటా యుగంధర్‌లను అరెస్టు చేసి కాకినాడ కోర్టుకు తరలించామన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణం, మండల పరిధిలో సోమవారం పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పిఠాపురం వ్యవసాయ శాఖ ఎడి స్వాతి సామర్లకోట పట్టణంలోని శ్రావణి ఎరువుల దుకాణాన్ని, మండలంలోని వేట్లపాలెంలో సత్యసాయి ఎరువుల దుకాణాన్ని పరిశీలించారు. మండలంలోని సక్రమమైన పద్ధతిలోనే ఎరువుల దుకాణాలు నిర్వహణ కొనసాగుతోందని ఎలాంటి లోపాలు తమ దృష్టికి రాలేదని ఆమె వివరించారు. ఈ తనిఖీల్లో ఇంకా మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య, ఎఎఒలు సతీష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం - రక్షించిన స్థానికులు

మామిడికుదురు : పాశర్లపూడి - బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు రక్షించారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. మలికిపురం మండలం గూడపల్లికి చెందిన నాగళ్ల సత్తిబాబు మానసిక ఒత్తిడితో ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరిలో దూకాడు. సమీపంలో చేపల వేటకు వెళ్లిన మత్యకారులు కొల్లు నాగేశ్వర్లు, రాకేష్ వర్మ, నాని దీన్ని గుర్తించారు. నీటిలో దూకి సత్తిబాబును రక్షించారు. అనంతరం నగరం ఎస్ఐ ఎస్‌కె. జానీభాషా సమాచారం ఇచ్చారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం, వేలివెన్ను గ్రామాల్లో పేకాట శిబిరాలపై సోమవారం దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.47,700నగదు, 11 సెల్ ఫోన్లు, కొన్ని పేకముక్కలు, స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.రామారావు తెలిపారు. రాబడిన సమాచారం మేరకు స్టేషన్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. జూదాలను నిర్వహించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. రెండు సార్లు జూదాల్లో దొరికితే ఉన్నత అధికారుల అనుమతితో షీట్స్ ఓపెన్ చేస్తామన్నారు.



నాసిరకంగా సిసి రోడ్డు పనులు

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి మండలంలోని సిరిపల్లి పంచాయతీ పరిధిలోని చెట్లవారిపేటలో ఎంపీ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు వేయడానికి వేస్తున్న సిమెంట్ మాల్‌లో గ్రావెల్ రాళ్ళ ఇసుక మాత్రమే కనిపిస్తున్నాయని, సిమెంట్ ఎక్కడా కానరావట్లేదని స్థానికులు తెలిపారు. ఇలా వేయడం వల్ల నెలరోజులకే రోడ్డు బీటలు వారి గుంతలు పడుతున్నాయని వాపోతున్నారు. నిర్మాణ పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

శబ్ద కాలుష్యంపై స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఏడిద రోడ్డులోని దుర్గమ్మ ఆలయం పక్క వీధిలో ఉంటున్న ప్రజలు శబ్దకాలుష్యంపై ఫిర్యాదు చేశారు. వీధిలో కొత్తగా వర్క్‌షాప్ ఏర్పాటు చేశారని రాత్రి పగలు పెద్ద శబ్దాలతో పనులు చేస్తున్నారని వి.రామకృష్ణ, శ్రీను, చౌదరి మున్సిపల్ అధికారులకు తెలిపారు. రాత్రి సమయంలో నిద్ర పోవడానికి ఇబ్బందులతో పాటు విద్యార్థులు పరీక్షల సమయం కావడంతో వారి చదువులకు ఆటంకాలు ఏర్పడుతుందని వాపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అవగాహనతోనే పరీక్షల్లో విజయం

ఎపిఎ ఇండియా అధ్యక్షుడు కృష్ణ భరత్

ప్రజాశక్తి-రాజోలు

పరీక్షలో విద్యలో భాగమని, సరైన అవగహన ఉంటే వాటిల్లో విజయం సాధించడం కష్టమైన పని కాదని ఎపిఎ ఇండియా అధ్యక్షుడు, సైకాలజిస్ట్ కృష్ణభరత్ పేర్కొన్నారు. సోమవారం సైకాలజిస్టుల సంఘం ఎపిఎ ఇండియా ఆధ్వర్యంలో మలికిపురంలోని ఎంవిఎన్‌జెస్ అండ్ ఆర్‌వి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో 10వ తరగతి విద్యార్థులకు విజయీభవ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ కృష్ణభరత్ మాట్లాడుతూ పరీక్షల పట్ల భయాన్ని వీడితే సమర్థంగా ఎదుర్కోగలమన్నారు. పరీక్షలు ప్రతిభకు కొలమానం కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. పరీక్షలను విద్యలో భాగంగానే చూడాలన్నారు. సబ్జెక్ట్‌ను గుర్తు పెట్టుకోవడానికి ఎలా చదవాలి, పరీక్షల ముందు రోజు, పరీక్ష రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఎపిఎ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సైకాలజిస్ట్ ఎంపీ జానకిరామ్ మాట్లాడుతూ ప్రత్యేక పద్ధతుల్లో ప్రిపేర్ అయితే సబ్జెక్టులపై పట్టు సాధించొచ్చన్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఎపిఎ ఇండియా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పివివి.వరప్రసాద్ మాట్లాడుతూ తమ సంఘం ద్వారా రాష్ట్ర లోని పదో తరగతి విద్యార్థుల కోసం విజయీభవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనికి సహకరించిన పాఠశాల కరస్పాండెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి అనుసంధాన కర్తగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ నక్క రమేష్‌బాబు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంవి,సత్యనారాయణ మూర్తి, ఎపిఎ ఇండియా యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.తేజ, గౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్‌వి.రమణారావు, ఉపాధ్యాయులు రామకృష్ణ, సూర్యనారాయణ, విజ్ఞాన్, వికాస్, గౌతమ్ గూడపల్లి, ఎఎఫ్‌బిటి, వివేకానంద పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణభరత్

వినియోగదారుల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

జి.రాగంపేట సచివాలయంలో సోమవారం వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం అందజేసిన వినియోగదారుల మ్యాగజైన్స్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సదస్సులో వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వినియోగదారులు మోసాలకు గురైతే వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదుచేసి న్యాయం పొందొచ్చన్నారు. ఈ సదస్సులో సంఘం సెక్రటరీ ఎం.భాస్కర్‌రావు, కెవివి.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎన్‌టి.శేఖర్‌బాబు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ డి.అనిల్‌కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.



మ్యాగ్‌జైన్స్ అందిస్తున్న సూర్యనారాయణమూర్తి తదితరులు

సాగర్ కళాశాలలో శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

యువ చైతన్య సేవాసమితి, నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాలు, తూర్పుగోదావరి జిల్లా క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సాగర్ డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. కమ్యూనిటీ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం,ప్రకతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు వంటి వాటిపై శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. మొదటిరోజు శిక్షణ తరగతులలో సిడబ్ల్యూసి సభ్యులు జంగం సంతోషి లీడర్‌షిప్, వ్యక్తిత్వ వికాసం, అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రం డిడి పిఆర్‌ఆర్ ప్రసాద్, ఫైర్ మాన్ సత్యనారాయణలు అగ్ని ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పి.శ్రీదేవి, జి.సాయికృష్ణ, ఎం.అచ్యుత రామయ్య, ప్రిన్సిపల్ బి.శ్రీను, వైస్ ప్రెసిడెంట్ నల్లా లీలావినోద్‌కుమార్, పోకల మణిమాల, సెక్రటరీ రాధా శ్రావణి, ఎన్‌వైకె వాలంటీర్లు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

గేదెకు కేన్సర్ కణితి తొలగింపు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక రాష్ట్ర పశుసంవర్ధక శాఖ శిక్షణ కేంద్రంలో పశు వైద్యాధికారులు పాడి గేదెకు శస్త్ర చికిత్స చేసి కేన్సర్ కణితిని సోమవారం తొలగించారు. ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామస్తుడు బి.రాజబాబుకు చెందిన పాడిగేదెకు ఆరు నెలల క్రితం పొట్ట పైభాగంలో చిన్న కణితిలా వచ్చింది. ఇటీవల కాలంలో అది పెరగడంతో రైతు గేదెను మండపేటలో పశు సంవర్ధక శాఖ శిక్షణ కేంద్రానికి తీసుకొచ్చాడు. వైద్యులు పరీక్షించి అందని కేన్సర్ కణితిగా గుర్తించారు. అక్కడ వైద్యాధికారులు డిడి కె.కష్ణమూర్తి, విఎఎస్‌విజిఎన్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 2 గంటల సెపు శ్రమించి శస్త్ర చికిత్స చేసి 2 కిలోల కణితిని తొలగించారు.



గేదెకు శస్త్రచికిత్స చేస్తున్న పశువైద్యులు

వారం పాటు ఆదిత్యలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్అపోలో సన్‌షైన్ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు వారం రోజలపాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని ప్రిన్సిపల్ ఆదిరెడ్డి రమేష్ సోమవారం ప్రారంభించారు. వారం రోజులపాటు విద్యార్థులకు పలు విభాగాల్లో నిపుణులైన వైద్యులతో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పలు ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు. సోమవారం సుమారు 100 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పిఒ, వాలంటీర్లు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం

ప్రజాశక్తి- కరప

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను ఎస్‌సి, ఎస్‌టి ప్రాంతాల్లో ఖర్చు చేయకుండా దుర్వినియోగం చేస్తుందని జనసేన పార్టీ పిఎసి సభ్యులు పంతం నానాజీ అన్నారు. పెనుగుదురులో సోమవారం ఎస్‌సి, ఎస్‌టి కాలనీలో, గ్రామ కమిటీ అధ్యక్షులు గంట నానిబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు బండారు మురళి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను మళ్లించిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.కొండబాబు, బి.గంగాధర్, వై.పండు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

టిడిపిలోకి పలువురు వైసిపి కార్యకర్తలు సోమవారం పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. కొండవరంలో గాది రాజబాబు, వేమగిరి రాంబాబు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి చెందిన పెండ్యాల శివ, మరికొందరు యువత ఈ సందర్భంగా టిడిపిలో చేరారు. వర్మ మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనిసెట్టి సత్యానందరెడ్డి, గాది రాజబాబు, దుళ్ళ సత్తిబాబు, పార్టీ అధ్యక్షులు సత్తిబాబు, వేమగిరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాజీ ఎంఎల్ఎ వర్మ



శిబిరాన్ని పరిశీలిస్తునన నిర్వాహకులు

150 మంది రక్తదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ, పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో పెద్దాపురం సాయి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెయిన్ రోడ్డు శివారులోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. సాయి సేవా సమితి సభ్యులు అద్దేపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి లక్ష్మణరావు, ఎ.రమేష్, రాజేష్, జి.సునీల్, జి.వాసు, హెచ్‌వి.చంద్రశేఖర్‌శర్మ, పి. వేణుగోపాలకృష్ణ, బి.బుజ్జి, పి.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి గంగమ్మ జాతర

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పెదబ్రహ్మదేవం మంచినీటి చెరువు గట్టు వద్ద దొడ్డి గంగమ్మతల్లి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. చింతలూరు కళాకారుల గరగల నృత్యం, డప్పు వాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ జాతరలో తోటకూర గంగాధర్, వారి కుటుంబాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

10 నుంచి సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని సచివాలయాల్లోని కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులకు ఈనెల 10న తహశీల్దార్ పాత కార్యాలయం ఎదురుగా ఉన్న లే-అవుట్‌లో పిఠాపురం ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ కార్యాలయ అధికారులు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మొదట గ్రూప్, మధ్యాహ్నం రెండు గంటలకు రెండో గ్రూప్‌నకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

లిబరేషన్ జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి- రౌతులపూడి

బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 15న నిర్వహించనున్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారాజు కోరారు సోమవారం రౌతులపూడి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024 సాధారణ ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే కర్తవ్యంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణమూర్తి ఉన్నారు

'వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలి'

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఏలేశ్వరంలో జరిగిన మండల గృహ సారథులు సచివాలయ కన్వీనర్ల శిక్షణా తరగతులకు నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి భరత్, రాష్ట్ర దృశ్య కళా చైర్మన్ కుడిపూడి శైలజలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం 93శాతం ఎన్నికల హామీలను అమలు చేసిందన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలమండ సత్యవతి, వైస్ చైర్మన్ శిడగం త్రివేణి, చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, లింగంపర్తి పిఎసిఎస్ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు, వైసిపి నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పర్వత

ఘనంగా బల్లల పండుగ

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

రజకులు ఆధ్వర్యంలో సోమవారం బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. అంగరలో శ్రీ రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఈ పండుగను నిర్వహించారు. విఘ్నేశ్వరుడు, పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. గారడీలు, డప్పు వాయిద్యాలు, బాణా సంచా కాల్పులతో ఊరేగింపు జరిగింది. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. రజక సంఘం పెద్దలు ఎ.సూర్యనారా యణ, టి.వీరబాబు, ఎం.నాగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

అవినీతిమయంగా వైసిపి పాలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వైసిపి ప్రభుత్వ పాలనంతా అవినీతి, దోపిడీల మయంగా మారిందని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అన్నారు. 12వ డివిజనలో సోమవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. ఈ మేరకు ముద్రించిన కరపత్రాలను పంచారు. తొలుత గాంధీ, ఎన్‌టిఆర్ విగ్రహాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, డివిజన్ మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత, ఒమ్మి బాలాజీ, పేకేటి సూర్య భాస్కరరావు తదిరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మడికిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు గళ్ల నాగవరలక్ష్మి, డి.సత్యవతి నివాసముంటున్న ఇంటికి సోమవారం తెల్లవారు జామున మంటలు అంటుకున్నాయి. దీంతో ఇంట్లో ఉన్నవారంతా ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఇంటో సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. విషయం తెలుసుకున్న వైసిపి సీనియర్ నాయకులు ఉండ్రాజపు చిన్న, పడమటి రాంబాబు, విఆర్ఒ సుదర్శన్ బాధితులను పరామర్శించారు. కొంత ఆర్థిక సాయాన్ని, రైస్ ప్యాకెట్లను ఇరు కుటుంబాలకు అందించారు. ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని వారు తెలిపారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి : బండారు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు డిమాండ్ చేశారు. బాధితులు నాగవరలక్ష్మి, సత్యవతి కుటుంబాలను ఆయన పరామర్శించారు. బియ్యం, వంట పాత్రలు, దుప్పట్లతో పాటు ఆర్థిక సాయం అందించారు. బాధితులకు సాయం అందించాలని తహశీల్దార్‌తో మాట్లాడారు. ఆయన వెంట కె.కృష్ణ, ఈదల రమేష్, ఎం.ఏడుకొండలు, ఎ.సత్యనారాయణరాజు, జి.మూర్తి, బి.మారుతి, యు.రాజు ఉన్నారు.



సాయం అందిస్తున్న వైసిపి నాయకులు, విఆర్ఓ తదితరులు



సాయం అందిస్తున్న మాజీ ఎంఎల్ఎ బండారు, టిడిపి నాయకులు